క్లుప్తంగా

కొనసాగుతున్న పంటల నమోదు



కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతండా, కేటీదొడ్డి, కొండాపురం తదితర గ్రామాల్లో యాసంగి పంటల వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఏఈఓలు ప్రీతిసుధ, ప్రియాంక క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రైతులు సాగుచేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ సాజిద్ రెహ్మాన్ కోరారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ధరూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీహరి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని రాయచూరు రోడ్డు, డ్యాం వెళ్లే ప్రధాన రహదారుల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి డ్రైవింగ్ చేయకూడదని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పురాతన బావిని కాపాడాలి

గద్వాల: జిల్లా కేంద్రంలో సంస్థానాధీశుల కాలం నాటి పురాతన కొత్తబావి ఆక్రమణకు గురవుతోందని.. ఉన్నతాధికారులు స్పందించి పురాతన బావిని కాపాడాలని ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో పురాతన బావులు, కట్టడాలను సంరక్షించే కార్యక్రమంలో భాగంగా కొత్తబావిని కూడా పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ధరూరు: మండలంలోని కొత్తపాలెం తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం స్వయం పరిపాన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలు బోధించారు. ఎంఈఓ రవీంద్ర బాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

అలంపూర్: జాతీయ రహదారిపై ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. ఏపీ నుంచి తెలంగాణకు ఇసుకను అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా.. పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెట్రోలింగ్ పోలీసులు మంజునాథ్, రవి ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ రాజేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఆత్మకూర్: పట్టణంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో తిప్పుడంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ వసంత గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందించారు. క్రమం తప్పకుండ పౌష్టికాహారం తీసుకోవాలని, సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ బెనర్జీ, ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి, ఆశకార్యకర్తలు, విద్యార్థులు ఉన్నారు.

డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని దుబ్బపల్లి స్టేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. కొకుంట్ల మండల కేంద్రానికి చెందిన అశోక్ తన కుటుంబంతో కలిసి గురువారం సాయంత్రం కారులో మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో రాచాల దాటిన తర్వాత దుబ్బపల్లి స్టేజీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీకొట్టింది. దీంతో కారు ధ్వంసం కాగా అందులో ఉన్న ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ సుభాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేసవి భత్యం ఏది?



జింకలపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- తీవ్ర నిరాశలో ఉపాధి హామీ కూలీలు
- వేసవిలో అదనపు భత్యం కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని పాలకులు



తిమ్మాపురం నర్సరీలో మొక్కలకు నీరు పడుతున్న ఉపాధి కూలీ (ఫైల్)

ఎర్రవల్లి: ఉపాధి హామీ పథకం కూలీలకు వేసవిలో అదనపు భత్యం అందకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వేసవిలో భానుడి భగభగలు.. కూలీల అవస్థలను గుర్తించి గతంలో వారికి అదనపు భత్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. అయితే వేసవిలో కూలీల శ్రమకు తగ్గట్టుగా సాధారణ భత్యంతో పాటు అదనపు భత్యాన్ని చెల్లించాల్సిన ప్రభుత్వం.. కొంత కాలంగా దీన్ని అమలు చేయడం మరిచింది. ఫలితంగా కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. అలంపూర్ నియోజకవర్గంలో 80,344 జాబ్ కార్డులు ఉండగా.. 1,55,652 మంది కూలీలు ఉన్నారు. అత్యధికంగా అయిజ మండలంలో, అత్యల్పంగా వడ్డేపల్లి మండలంలో జాబ్ కార్డులు, ఉపాధి కూలీలు ఉన్నారు.

సౌకర్యాలు కరువు..

ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు ప్రభుత్వం ప్రస్తుతం రోజువారీ కూలీగా రూ. 257 అందిస్తోంది. వేసవిలో కూలీలకు అదనపు భత్యం చెల్లించకపోవడంతో పాటు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఉపాధి హామీ పనులు చేపట్టిన ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో లేకపోవడంతో కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. కూలీలు ఎండ వేడిమిని తట్టుకోలేక ఆస్పత్రుల బారిన పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని అవస్థలు..

ఉపాధి హామీ పథకంలో భాగంగా దాదాపు 150 రకాలకు పైగా పనులు చేస్తున్నారు. భూమిని చదును చేయడం, సేద్యపు కుంటలు, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ, ఇంకుడు గుంతల నిర్మాణం, కిచెన్ గార్డెన్‌లు, నర్సరీల్లో మొక్కల పెంపకం వంటి పనులకు ఉపాధి హామీలో ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వేసవిలో భానుడి భగభగతో ఉపాధి హామీ పనులు చేయడం కూలీలకు కష్టతరంగా మారింది. మరోవైపు మార్చి నుంచే అదనపు భత్యం అందాల్సి ఉండగా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. గతంలో మార్చి నుంచి 20శాతం అదనపు భత్యం ప్రారంభమై.. జూన్ వరకు నెలనెలా కొంతమేర పెంచుతూ కూలీలకు అందించేవారు. అలాగే ఉపాధి పని కోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల లోగా పనులు కల్పించకపోయినా.. కూలీలకు ఉపాధి భృతి పొందే హక్కు ఉండేది. వేసవిలో అదనపు భత్యం అందించడం.. ప్రత్యేక వసతుల కల్పనపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..



ఉపాధి హామీ పనులు చేపట్టిన ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కొందరు కూలీలు వడదెబ్బకు గురై అస్వస్థతకు గురవుతున్నారు. ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో లేవు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో తప్పనిసరిగా టెంట్లను ఏర్పాటుచేయాలి.

– శివగోవిందు, జింకలపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



గతంలో ఉపాధి హామీ కూలీలకు మార్చి నుంచే అదనపు భత్యం అందేది. జూన్ వరకు క్రమక్రమంగా పెరుగుతూ నాలుగు నెలల వరకు అదనపు భత్యం వచ్చేది. ఎండ తీవ్రత అధికమైన నేపథ్యంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– అజార్ మొహియుద్దీన్, ఎంపీడీఓ

మండలాల వారీగా ఉపాధి కూలీలు, జాబ్‌కార్డుల వివరాలు ఇలా..

మండలం	గ్రామాలు	జాబ్ కార్డులు	కూలీలు
ఇటిక్యాల	35	16,438	38,186
మానవపాడు	16	10,727	21,933
ఉండవెల్లి	16	9,864	21,116
అలంపూర్	14	9,109	18,400
వడ్డేపల్లి	10	6,138	13,219
రాజోళి	11	10,546	23,341
అయిజ	28	17,522	19,457

ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు



మానవపాడులో విద్యార్థులకు రూం నంబర్ చూపిస్తున్న ఎస్‌ఐ చంద్రకాంత్



ధరూరు పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

ధరూరు/మానవపాడు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ధరూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ శ్రీహరి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతవారణంలో విద్యార్థులు పరీక్షలు రాశారని చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

⇨ మానవపాడు మండలంలోని గంగు వెంకట కృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 137 మంది విద్యార్థులకు గాను 136 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు సూపరింటెండెంట్ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్‌ఐ చంద్రకాంత్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేషన్ షాపుల్లో తనిఖీలు



అయిజ: మున్సిపాలిటీలోని 3, 8, 5, 12, 13, 43 రేషన్ షాపుల్లో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ ప్రశాంత్‌గౌడ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ మాట్లాడుతూ.. రేషన్ షాపుల్లో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేషన్ బియ్యంలో విటమిన్ బీ12, ఫ్లోరికామ్లం, ఐరన్ వంటి ఎన్నో పోషక విలువలు ఉన్నాయన్నారు. రేషన్ బియ్యాన్ని బయటి మార్కెట్‌లో విక్రయించిన, కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధ్వాన దారులతో అవస్థలు



బల్గెర - మల్లంపల్లి రోడ్డుపై తేలిన కంకర

గట్టు/ఉండవెల్లి/మానవపాడు: గట్టు మండలంలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కంకర తేలి గుంతలమయంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించలేక పల్లె జనం అవస్థలు పడుతున్నారు. గట్టు - గొర్లఖాన్‌దొడ్డి, గట్టు - మాచర్ల, బల్గెర - మల్లంపల్లి, బల్గెర - తుమ్మలపల్లి, ఇందువాసి - బోయలగూడెం, గట్టు - అరగిద్ద, అరగిద్ద– గొర్లఖాన్‌దొడ్డి రోడ్లు అధ్వానంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రం, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో గుంతలమయంగా మారిన రోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. గట్టు నుంచి గొర్లఖాన్‌దొడ్డి మీదుగా అయిజ వరకు ఉన్న బీటీరోడ్డు మరమ్మతు కోసం అధికారులు చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు భారత్‌మాల రోడ్డు నిర్మాణంతో పాటు గట్టు ఎత్తిపోతల పథకం పనుల కోసం నిత్యం తిరుగుతున్న భారీ వాహనాల కారణంగా రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

⇨ ఉండవెల్లి మండలంలోని పుల్లూరు – మెన్నిపాడు బీటీరోడ్డు నిర్మాణానికి గ్రహణం పట్టింది. మూడేళ్ల క్రితం రోడ్డుపై కంకర పరిచి వదిలేయడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనుల పూర్తిపై సంబంధిత అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

⇨ మానవపాడు మండలంలోని గోకులపాడు నుంచి చంద్రశేఖర్‌నగర్ గ్రామానికి వెళ్లే రహదారిపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు తిరిగే రోడ్డుపై ఏర్పడిన గోతులతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గట్టు- మాచర్ల రోడ్డు ఇలా..



పుల్లూరు - మెన్నిపాడు రోడ్డు దుస్థితి



గోకులపాడు - చంద్రశేఖర్‌నగర్ రోడ్డుపై ఏర్పడిన గోతులు

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



అల్వాలపాడు పాఠశాలలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు/శాంతినగర్: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుకొని వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు సూచించారు. గురువారం ధరూరు, కొత్తపాలెం, అల్వాలపాడు ఉన్నత పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యస సామర్థ్యాలను ఎంఈఓ తెలుసుకుని పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరు కావాలన్నారు. విద్యార్థులను అన్నివిధాలా వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

⇨ వడ్డేపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వాసవీ క్లబ్ శాంతినగర్ మాజీ అధ్యక్షుడు గాయత్రి శ్రీనివాసులు పెన్నులు పంపిణీ చేశారు. చిలుకూరి శివాలయం పూజారి సురేష్ రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు వితరణ చేసిన పెన్నులను సప్తగిరి శ్రీనివాసులుతో కలిసి మండలంలోని విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హోరాహోరీగా వృషభరాజాల బల ప్రదర్శన



బండలాగుడు పోటీలో పాల్గొన్న వృషభరాజాలు

రాజోళి: మండల కేంద్రంలో భ్రమరాంబ అడివేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని గురువారం నిర్వహించిన సీనియర్స్ విభాగం వృషభరాజాల బల ప్రదర్శన (బండలాగుడు) పోటీలు హోరాహోరీగా సాగాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళ హారతులు పట్టి పోటీలను ప్రారంభించగా.. వివిధ ప్రాంతాలకు చెందిన వృషభరాజాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. మొదటి స్థానంలో ఫల్కందొడ్డి ఖాజా ఎద్దులు నిలవగా.. మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ప్రకటించిన రూ. 50వేల నగదు బహుమతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన పీఆర్ పల్లి మంగిళి నాగయ్య ఎద్దులకు కుర్వ కిష్టన్న, ఎర్రకోట ఎల్లారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి రూ.40 వేలు, మూడవ బహుమతిగా రూ. 30వేలను పులిపాటి దస్తగిరి, కోల్కార్ అసేన్, అరీఫాబీ అందజేశారు. నాలుగో స్థానంలో నిలిచిన గార్లదిన్నె రామాంజనేయులు ఎద్దులకు వంకమహేశ్, వీరేశ్ రూ. 20వేలు, ఐదో స్థానంలో నిలిచిన కె.సింగవరం గ్రామానికి చెందిన హర్షిణి బుల్స్‌కు ప్రవీణ్‌కుమార్, గడ్డం సుదీర్‌లు రూ.15వేలు అందజేశారు. అదే విధంగా ఆరు, ఏడు స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు గొండ రాజు, భీముడు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి, దస్తగిరి, ప్రకాశ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



అయిజలో స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

గద్వాలటౌన్/అయిజ: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించడంతో గురువారం ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లపైకి చేరుకుని పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. దుకాణదారులు, వాహనదారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు సైతం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాల్లో మునిగి తేలారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్ ఎక్బోటే, రామాంజనేయులు, జయశ్రీ, నర్సింహ, శివారెడ్డి, చిత్తారి కిరణ్, కృష్ణ, శంకర్, పాండు, మోహన్‌రెడ్డి, వాసు, నర్సింహులు పాల్గొన్నారు.

⇨ రాష్ట్రంలో ఇకపై ఎలాంటి ఎన్నికలు నిర్వహించినా బీజేపీదే విజయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంపై హర్షం వ్యక్తంచేస్తూ అయిజ మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్న ప్రజలు బీజేపీవైపు చూస్తున్నారని, కాంగ్రెస్ పార్టీకి కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భగత్‌రెడ్డి, శివారెడ్డి, లక్ష్మణ్ గౌడ్, రఘు, వినోద్, రాము పాల్గొన్నారు.

సంపత్‌కుమార్‌కు సముచిత స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మానవపాడు: క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు ఎమ్మెల్సీ పదవితో సముచిత స్థానం కల్పించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మహ్మద్ సిరాజ్, మండల అధ్యక్షుడు జగన్మోహన్ నాయుడు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ప్రలోభాలు పెట్టినా, పోలీసు కేసులు పెట్టినా కాంగ్రెస్ పార్టీ జెండాను వదలలేదని గుర్తుచేశారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ.. పార్టీని మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులందరికీ అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ అధిష్ఠానం సంపత్‌కుమార్ సేవలను గుర్తించి, ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అమరవాయి మాజీ సర్పంచ్ మోహన్, నాయకులు పరమేశ్ నాయుడు, సిరాజ్, జగదీశ్‌గౌడ్, రమేశ్, చెన్నయ్య, దీవాకర్‌గౌడ్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాత బృందం

ధరూరు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాజాత బృందం సూచించింది. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని మాల్‌దొడ్డిలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇటీవల రైతు రుణమాఫీని అడ్డం పెట్టుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని.. అలాంటి వారి మాటలు నమ్మవద్దని పడొద్దని సూచించారు. ముఖ్యంగా వారు పంపించే లింక్స్ ఓపెన్ చేయొద్దని.. ఓటీపీలను చెప్పవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌న సంప్రదించాలని తెలిపారు. గ్రామంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. బాల్యవివాహాలతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని.. బాల్యవివాహాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అదే విధంగా పోక్సో చట్టం, శిక్షలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. మహిళలకు భరోసా కేంద్రం అందిస్తున్న సేవలను వివరించారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే 87126 70312 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాధమ్మ, కళాబృందం సభ్యులు కృష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గ్రామాల్లో సర్వే

అమరచింత: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సర్వే చేపడుతున్నామని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ తెలిపారు. మార్చి చివరి నాటికి సమస్యలపై సర్వే నిర్వహిస్తామన్నారు. మండలంలోని ధర్మాపురం కాలనీల్లో గురువారం తిరుగుతూ సమస్యలు గుర్తించామన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుందని, సీసీ రోడ్ల సమస్య వేధిస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణాలు లేకపోవడంతో మురుగు రహదారులపై పారుతుందన్నారు. సాగునీరు లేక వ్యవసాయ భూములను బీడుగా వదిలేస్తున్నారని, ఎత్తిపోతల పథకం చేపట్టి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఏడో తరగతి వరకే పాఠశాల ఉండటంతో ఉన్నత చదువులతో పాటు ఇతర గ్రామాలకు ప్రజలు వెళ్లాలంటే రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మన్యం, బాలకృష్ణ, శంకర్, మోహన్, మహేష్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల కె.నీలాంజనుడు - 9642913894
అలంపూర్/అయిజ ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొందత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బార్ లాల్ : 9553955603